# అజంతా

## 1

కొందరు సంసారాన్ని పోషించడంకోసం వుద్యోగం చేస్తారు. మరికొందరు యీ బాదరబందీ లేనివాళ్ళు విశ్రాంతి పొందడంకోసం కష్టపడి పనిచేస్తుంటారు. శలవుదినాలకోసం యెదురుచూసే వాళ్ళలో గోపాలదాసు వొకడు. కోర్టులు మూశారు, ఆశలపలికి అతనికి సుశీలకాపరం ఎల్లా వుందో చూడాలని బుద్ధిపుట్టింది. సుశీలకి ఆడపిల్ల పుట్టి అప్పుడే ఐదేళ్ళు దాటుతోంది. ఎప్పుడో పిల్లపుట్టకపూర్వం చూశాడు. తనని నిరాకరించి, అన్యశాఖకి చెందిన మధుసూదనరావుని పెళ్ళిచేసుకున్నందుకు మొదట్లో ఆసూయపడినా కాలం గడిచినకొద్దీ ఆ ద్వేషభావం నశించి, యిప్పుడు వారి దాంపత్యాన్ని ఆదర్శంగా యెంచి వారిని నిజంగా గౌరవమైన ఆపేక్షతో ఎంచుతున్నాడు.

సుశీల "ఇంటర్" పరీక్షలు ముగియగానే మధుసూదనరావుని ప్రేమించి పెళ్ళి చేసుకుందంటారు. అతనికి మాన్‌భూమ్‌జిల్లాలో బొగ్గు గనిలో చిన్న ఇంజనీర్ ఉద్యోగం అయిందని చేసుకుందంటారు మరికొందరు. అతన్ని మొదటిసారి చూసినప్పుడు అతనిలో ఏముందని సుశీల వివాహం చేసుకుందో దాసుకు అర్థం కాలేదు. మధు అంత అందగాడు కాడు. అసలతన్ని చూడగానే, "ఇతను చక్కటివాడేనా?" అన్న సమస్యే రాదు. పైగా అతను నానిముచ్చులా కనిపిస్తాడు, ఏకాకి, మీటింగులు, "సోషల్ ఫంక్షన్స్" నాటకాలు, ఉద్యమాలు, రాజకీయాలు— వేటిల్లోనూ ప్రవేశించడు, ఎప్పుడూ దిగులుగా, యీలోకానికి సంబంధించనట్లు ఆలోచిస్తూవుంటాడు, మితభాషి. పోనీ, మంచి మంచి దుస్తులు ధరించి "ఫేషనబుల్"గా వుంటాడేమో అనుకుంటే అదీ కనిపించదు. ఇంట్లో వున్నప్పుడు ఎప్పుడూ వొంటిమీద చొక్కా-కూడా వుండదు. ఆ తలనొప్పి పుట్టించే లుంగీ, వారం పదిరోజులదాకా గొరిగించని గడ్డం, అర్థంలేకుండా వంకరలు తిరిగిపోయిన క్రాపింగు—తలుచుకుంటే మధు అనాగరికుడులా,

చరిత్రాత్మక మానవుడులా వుంటాడు. ఇట్లాంటి మధుని సుశీల వివాహమాడడం దాసు కెంతో ఆశ్చర్యం కలగచేసింది.

దాసు కోర్టు మానుకుని, సుశీలని వర్ణిస్తూ దినాలు దినాలు గడపగలడు. ఆంధ్రదేశంలో ఆరోజుల్లో కొంతవరకేనా కాలేజీలలో చదువుకున్న స్త్రీలని వేళ్ళమీద లెక్కపెట్టొచ్చు. చదువు, చక్కదనం రెండూ ఏకీభవించాయి సుశీలలో. ఎంతో చలాకీగా, సరదాగా మాట్లాడి అన్ని రకాల వ్యక్తులకి కాలక్షేపం కలిగించగలదు. వీణమీద ఎంతో చక్కగా పాడుతుంది. "సుశీ పాడితే నక్షత్రాలు నృత్యం చెయ్యడం మాట నే చెప్పలేను కాని, అవి కదలడం మట్టుకు కదుల్తాయని గట్టిగా చెప్పగలను" అంటాడు దాసు. అన్నింటిలోకి సుశీలలో ఆకర్షణీయమైన వస్తువు ఆమె ప్రవర్తన. గొప్ప నైతికదృష్టిని వ్యక్తపరిచే నడవడి, ప్రత్యేకంగా వొక "కేరక్టర్" వున్న స్త్రీ. చదువుకున్న స్త్రీలలో ప్రవర్తన లేదని ఆమె స్వేచ్ఛని నిందిస్తూ ఆక్షేపించడం వొక ఫేషన్ అయిపోయింది. ఈవిమర్శ తప్పనీ, గుడ్డిదనీ ఋజువు చేసేందుకు సుశీల చదువుకుందని దాసు అభిప్రాయం. చదువుకొని ప్రేమించింది కాబట్టి యితరశాఖవ్యక్తినైనా సరే వివాహం చేసుకు తీరింది—— యెంతో మందికి, ముఖ్యంగా దాసుకే నష్టం కలిగించి. పెండ్లి కాగానే చదువు చాలించింది, భర్తతో కాపరంచేసి యెంతో గౌరవం సంపాదించింది. భర్తకి మంచి కుటుంబీకుడని కీర్తి తెచ్చిపెట్టింది. ప్రేమతో విండిన ఆదర్శవంతులు వారొక్కరేనని దాసు మనసారా నమ్మాడు.

కాని, మొదట్లో మధుని చూసినప్పుడు వారి వివాహం చాలాకాలం నెగ్గుతుందని దాసు అనుకోలేదు. ఇప్పుడు అతను పొరపడ్డానని గ్రహించుకున్నాడు. విచిత్రమైన స్వార్థంతో కుళ్ళిపోతున్న భర్తకి సుశీలస్నేహం వల్ల మనోవికాసం, సభ్యత నేర్పి తన వాడివిగా చేసుకుని వుంటుంది, తన చాతుర్యంవల్ల, సుశీలభర్తగా జీవించిన మధు యిప్పుడెలా తయారయాడో చూడాలని వుంది దాసుకి. ముఖ్యంగా, సుశీలయిప్పుడెలా వుందో? చుట్టంగా మాత్రంకాక, యితరవిధంగా తను ఆమెకి జ్ఞాపకం వున్నాడా? సుశీల అక్క జ్ఞానశక్తిదేవి, యౌవనంలో, పాపం, ఆ వైధవ్యాన్ని ఎలా అనుభ

విస్తోందో? ఆ రాత్రే గోపాలదాసు ప్రయాణం కట్టాడు.

ఆదర్శప్రేమ యివ్వగల వ్యక్తికోసం యెదురు చూస్తూ, వివాహ యత్నాలు విరమించిన బ్రహ్మచారులలో దాసు వొకడు.

రైల్లో సుశీలతో ఎల్లా మాట్లాడాలో ఆలోచించడం మొదలెట్టాడు. ఇతనెన్నో చమత్కారాలు చెప్పడానికి సంకల్పించుకున్నా, సమయానికి అవి రావని బాగా అనుభవం. అనుకున్న విషయం మరిచిపోకుండా మాట్లాడగలిగినవాళ్ళని చూస్తే యితనికి మహాగౌరవం. ఏమీ చదువుకోక పోయినా సుశీల అక్క జ్ఞానశక్తి వెనక వొక చమత్కారమైన విషయం చెప్పి యితని ప్రేమగౌరవాలను పొందింది. "మంచి అందమైన స్త్రీలకి మంచి తెలివైన భర్తలు ఎందుకు దొరకరో?" అని దాసు ప్రశ్నించి నప్పుడు, జ్ఞానశక్తి "తెలివైన పురుషులు మంచి అందమైన స్త్రీలను చేసు కోరు గనక" అని సమాధానం చెప్పింది. అది విన్నతర్వాత ఆమెను మరిచిపోవడం ఎల్లా? దాసును, జీవితం అనే పాఠశాలలో విద్యార్థి అనొచ్చు.

## 2

ఉదయం తొమ్మిదింటికి బండి సుశీలగారింటిముందు నిలిచింది. దాసు లోనికి ప్రవేశించగానే సుశీల అన్న ప్రబోధ కనిపించాడు.

"ఇన్‌ష్యూరెన్సు వాళ్ళకికూడా ఎండలు, శలవులు అంటూ వున్నా యన్నమాట" అన్నాడు దాసు గదిలో కుర్చీలో కూర్చుని. ప్రబోధ సమా ధానం చెప్పడు, నవ్వాడు. "ఎక్కడనుంచి రావడం?" అని మాత్రం అన్నాడు పచార్లుచేస్తూ.

"కోర్టులు మూశారు. చూసిపోదామని వొచ్చాను. నువ్వెప్పు డొచ్చావ్? నీకేమన్నా పిల్లలా, లేక బర్త్‌కంట్రోలా" అన్నాడు దాసు హాస్యం యత్నిస్తూ.

ప్రబోధ నవ్వాడు. మాట్లాడడు.

"చెప్పడానికి సిగ్గుపడుతున్నావు కాబోలు. పోనీ, నీభార్యనే అడు గుతా. ఎన్నోనెలో. ఇక్కడుందా?"

"లేదు. నిన్ననే వొచ్చా, సుశీల పెళ్ళిగామిస్తే"

దాసు పెదవికొరుక్కున్నాడు. "టెలిగ్రామా? ఏంకథ? తులాసాగా వుందా....సుశి ఏదీ?" అని లేచాడు

"అగదిలో వుంది. వెళ్ళి చూడు"

"జైఫాయిడా?"

"దాని క్కాదు. ఏం జబ్బు చేసిందో మధుగాడికి...."

దాసు కేమీ అర్థంకాలేదు. ఇద్దరూ గదిలోకి వెళ్ళారు. సుశీల ఈజీ చైర్‌లో కూర్చుని, కాళ్ళు బల్లమీద అనించింది. ఒక చెంపమీద చీర కొంగు కప్పుకుని పరుంది.

దాసు దగ్గరగా వొచ్చి చెయ్యి పట్టుకు చూశాడు. అతని చేతిమీద వేడి కన్నీటిచుక్కలు పడ్డాయి.

"వొళ్ళు చల్లగానే వుందే!" అన్నాడు.

"దాన్ని చూస్తే నాకు మండుతోంది వొళ్ళు. ఏడ్పు మానమంటే మానదు. సీతీ జాతీ లేకుండా లేచిపోయిన వెధవకోసం ఏడవడం పాపం కూడా. చదువుకుంటేం, ఉద్యోగం ఏడిస్తే ఏం, పరువూ మర్యాదా తగల డకపోయింతర్వాత...."

"ఎవరు? లేచిపోవడ మేమిటి? వైద్యుడా?"

"పేరు చెప్పేందుకు కూడా సిగ్గేస్తోంది."

"నేను నమ్మను అన్నయ్యా. నిష్కారణంగా ఆయన్ని తిడు తున్నావు ఆయన మంచివాడు. పదేళ్ళు కాపరంచేసిన నాకంటె నీకెక్కువ తెలుసా?"

"పోనీ, తెలుస్తే, ఎక్కడి కెళ్ళాడో నీకెందుకు తెలీదు? పెద్ద లవ్ మారేజి అని చెప్పి విర్రవీగావ్! రిజిష్ట్రారుముందు ముడెట్టుకున్న మొగుడు, పదేళ్ళైనా నీతో కలిసివున్నందుకు సంతోషించక పైగా ఏడుస్తా వెందుకు?"

"నీకు టెలిగ్రామ్ యిచ్చింది, ఆయన్ని తిట్టడం కోసం కాదు. నీకు చేతనైతే వాకబుచెయ్యి. మతిసరిగాలేక వెళ్ళివుండచ్చు.

దాసుకు బోధపడింది.

"ఫ్యాక్టరీలు, గనులు మొదలైన భయంకరమైన వృత్తులలో పని

చేసేవాళ్ళకి అప్పుడప్పుడు పిచ్చెత్తడం సహజం. పిచ్చి తగ్గగానే తిరిగి మళ్ళా వొస్తాడు. లే, లే, ఏడవకు. ఇంతకీ ఎక్కడికి కెళ్ళాడు?

సుశీల కళ్ళనీళ్ళు తుడుచుకుంది. ఆమెది ఏడుస్తున్నప్పుడుకూడా అందంగా కనపడే చక్కదనం కాదు. చాలా నీరసంగా కనిపిస్తుంది. గర్వంగా చూసే ఆమె కళ్ళూ, అహంభావం సూచిస్తూ పైకి కొనగా లేచిన ముక్కూ ఆ చిక్కన చెక్కిళ్ళమీద క్రమంగా లేవు. పళ్ళు చూపదు. పట్టుదలని పెదవులవెనక దాచుకుంది, స్వార్థాన్ని శరీరంలో దాచుకున్నట్లు.

మామూలు కుశలప్రశ్న లవగానే, దాసుకి కాఫీ తెచ్చిపెట్టింది జ్ఞానభక్తి. ఆమెని చూసి దాసు కంగారుపడ్డాడు. "నువ్వా యిక్కడే వున్నావ్? నీకోసం కలకత్తాకూడా వొద్దామా అనిపించింది. ఇంకా నయం, ముందే కలకత్తా వెళ్ళాను కాదు...."

"ఏదో అంటావుకాని,— నిజంగా వొద్దువా?"

"రాకేం? నాకు కావల్సినంత స్వేచ్ఛ. సంసారం చట్టుబండలు లేదుగా యింకా...."

"సుశీల సంసారం యిల్లా తగులడిందిగా...."

"అబ్బ! వూరుకోవే!— ఆయన నన్ను విడిచిపెట్టి ఎక్కడికీ వెళ్ళరు........" అంది సుశీల విచారంలో కోపంతో.

"అబ్బే, తప్పకుండా నీదగ్గరకే వొస్తాడు,— ఏ తురకదాన్నో తీసుకుని...."

"ఊరుకో అన్నయ్యా. నీకేం తెలీకుండా వుందా? ఆయనకి ముప్పై ఏళ్ళు దాటినై. ఆయన కట్లాంటి బుద్ధులు ఎప్పుడూ లేవు. నేను ఆయన్ని వొదిలి ఎప్పుడూ వుండలేదు...." ఏడుపుమధ్య సుశీలమాటలు స్వగతంగా వుంటాయి.

"అసలు విషయం చెప్పు, జ్ఞానం" అన్నాడు, జ్ఞానభక్తికేసి తిరిగి దాసు. జ్ఞానభక్తి బల్లమీది వుత్తరాన్ని చేతి కిచ్చింది.

"ప్రియమైన సుశీ కి—

నేను ఉత్తరహిందూస్థానం వెడుతున్నా. మళ్ళా ఎప్పటికొస్తానో చెప్పలేను; అసలు వొస్తానో రానో చెప్పలేను. నీమీద కోపం లేదు. నువ్వు చాలా మంచిదానవు. నీలో ఏలోటూ లేదు. సక్రాలైన్ బ్యాంకుతాలూకు రెండువేలు నీకు ఒక వారంలో అందుతాయి. తాళంచెవి రంగడికిచ్చాను. గుడ్‌బై.

ఇట్లు, ప్రియుమైన
మధుసూదనం."

సుశీల గర్వంగా దాసుకేసి చూసి "చూశావా, నాలో ఏలోటూ లేదన్నారు" అంది.

"అదే వొక గొప్పలోపై వుంటుంది" అంది జ్ఞానభక్తి పెదవి విరుపుతో. దాసుకి ఈ వాక్యం మరింత గొప్పగా స్ఫురించింది. జ్ఞానభక్తిది వయస్సుతో ఎదిగినకొద్దీ పరిపూర్ణత పొందే సౌందర్యం. అది చర్మం మీదకాక శీలంపైన ఆధారపడిన అందం. మనం కళ్ళుమూసుగు చూసినా కనిపించే అందం. అందులో వికాసం వాతావరణాన్ని బరువుగా చేస్తుంది. బరువైన శరీరం, లోతైనా హృదయం, స్ఫుటంగాతీర్చి నట్లుగా వుండే అవయవాలు - ప్రాకృతిక సంబంధమైన వైరిశక్తి ఆ కంఠంలో విని పిస్తుంది.

ఎందుకో ఆమెని చూస్తే దాసుకి అరణ్యాలు జ్ఞాపకానికొచ్చాయి. మహారణ్యాలలో చెట్లనీడక్రింద చలించకుండా, నిశ్శబ్దంగా వుండే నీటి గుంటలమాదిరి లోతుకలిగిన నేత్రాలు ఆమెవి. వ్యర్థపరచని స్వచ్ఛమైన శక్తుల కూర్మివల్ల, సృష్టికోసం దాచబడి, జ్వాలలా మండిపడుతున్న ప్రాచీనవెలుగు ఆమెలో వ్యక్తమౌతుంది.

"నీకు తెలీదు నా మొగుడుసంగతి."

"నీకు తెలిస్తే చెప్పరాదూ?"

"ఉత్తరహిందూస్థానంలో ఏముంది? ఎవరెస్టు శిఖరం చూడాలని వెళ్ళాడా?" అన్నాడు దాసు.

"ఏమీకాదు. ఎవతినో తీసుకుపోయివుంటాడు - కనుక్కుంటే చెప్పారు, ఈ మధ్య సాయంత్రం క్లబ్బుకు రావడంలేదని. ఆనమ యిలలో ఏనొందారమ్మనో, ఏభృంగినో...."

"ఛ, ఛ-ఊరుకో అన్నయ్యా. నాభర్త అంత నీచమైనవాడైతే అసలు నే చేసుకుంటానా...."

"ఓస్, ఎట్లాంటివాడో లోపలికి దూరి చూశావా?" అంది జ్ఞానభక్తి.

దాసుకి యిదంతా తమాషాగా వుంది. మధు విషయం అతనికే బోధపడలేదు. మామూలుగా కనపడే మనుషులు యేదోవొక సమయంలో ప్రమాదంగా మారగలరు కాబోలు. సుశీల భర్తమీది ప్రేమవల్ల విడిచి వుండలేక ఏడుస్తోందో, లేక తనని చూసి అందరూ చెప్పుకుని పరిహసిస్తారని విచారిస్తోందో ! సుశీలంతటి మంచి, తెలివైన, అందమైన స్త్రీ భర్త ఆమెను వొదిలి పెట్టాడంటే సుశీలస్వార్థాని కెంత దెబ్బో, ఆ సంఘంకోసం కార్చిన కన్నీరులో చల్లగా తగుల్తుంది.

"ఐనా,ఏడేళ్ళ కూతురుండగా, మధుకి యిదేం మాయరోగం, లేచి పోడానికి!"

"కొడుకునికూడా సంపాదించాలని" అంది జ్ఞానభక్తి.

సుశీల కోపంతో కొంగు చెంపమీద కప్పుకుంది. భర్తని వెదికి తీసుకురమ్మని దాసుని ప్రయాణం కట్టించింది. ప్రతిమలాడింది. అన్నకి కోపం; అక్కకి ద్వేషం. దేవుడే పంపాడు దాసును. ఎంత ఖర్చుఅయినా సరే,—వెడితే, అతని సహాయం ఎప్పుడూ మరవదు, జ్ఞానభక్తినికూడా రమ్మన్నాడు దాసు.

"అతని మొహం నే చూడలేను. అతన్ని తలుచుకుంటే, అతని బండశరీరాన్ని స్మరిస్తే, నావొళ్ళు భగాభగా మండుతుంది. నే రాను." అంది జ్ఞానభక్తి.

3

నాలుగురోజులు ఊళ్ళంటా తిరిగి, వాకబులతో విసుగుచెంది, దాసు ఆఖరికి ఔరంగాబాదు చేరుకున్నాడు. అక్కడనుంచి అజంతా, ఎల్లోరా గుహలకి ముప్పైమైళ్ళు మోటారుమీద ప్రయాణం. అక్కడ పార్కులో హోటల్లో టీ త్రాగుతుంటే, దాసుకి మధుసూదనం కనిపించాడు. అతని బల్ల దగ్గర మరో వ్యక్తికూడా వున్నాడు — వేషాన్ని బట్టి గుజరాతీ.

మధుదగ్గర కెళ్ళి, నవ్వుతూ ఆహ్వానించాడు. అతను ఏమీ మాట్లాడలేదు. మరో కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. "ఎక్కడినుంచి రావడం" అనేనా అడగనందుకూ, అతని గర్వానికి కోపం వొచ్చింది. మాసిన దుస్తులు, పెరిగిన గడ్డం, శూన్యత్వంకేసి స్థిరంగాచూసే కళ్ళు — అతన్ని సుశీల భర్తగా వూహించడమే కష్టంగా వుంది.

"నువ్వొచ్చి ఎంతకాలమైంది?" అని అడిగాడు దాసు.

"ఏమో."

"బసెక్కడ?"

"ఇక్కడే."

"అంటే?"

"ఇక్కడ గదిలో."

మళ్ళా నిశ్శబ్దం. అతనితో చెప్పదలుచుకున్న నీతులు, పెట్టదలుచుకున్న చీవాట్లు జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాడు దాసు.

"నేను రావడం యింటిదగ్గరనుంచే" అన్నాడు నవ్వు యత్నించి.

"కావొచ్చు."

దాసుకి వొళ్ళు మండుతోంది. తనకేమీ తెలీదనుకుని దాచటానికి యత్నిస్తున్నాడు కాబోలు ఆ గుజరాతీవాడు లేకపోతే అక్కడే అడిగేను.

"సుశీల నువ్వు వొచ్చేసినప్పటినుంచీ లేవడం లేదు."

సమాధానం లేదు. మళ్ళా—

"సుశీల చాలామంచిది."

ఈసారి నవ్వాడు.

"ఇది నవ్వేవిషయం కాదు. భార్యాపిల్లల్ని త్యజించి,...."

ఇంకా నవ్వుతున్నాడు.

"ఛ! నవ్వకు,-సుశీతో చెప్పిరాలేక పొయ్యావా? సుశీ క్షమించునేమో."

అత నివేవీ వినిపించుకోడం లేదు. దాసుకీ నవ్వొచ్చింది లోపల



కథా నిలయం

అతని వైఖరి చూస్తే. చెడిపోయిన వాళ్ళమీద కోపగించడం ఎంతకష్టం, హాస్యదృష్టివున్న వాళ్ళకి!

"ఆ మనిషేదీ?" అని ప్రశ్నించాడు దాసు.

"ఏమనిషి?"

"అదే. ఎవరికోసం పెళ్ళాన్ని వొదిలేసొచ్చావో, అది."

"నా కేం తెలీడంలేదు."

"అమాయకత్వం నటిస్తే లాభంలేదు భాయీ....నేనూ నీలాంటి వాడినే. నువ్వు లేవదీసుకొచ్చిన ఆ మనిషి ఎవరవి?"

"చూపిస్తా రా."

అతను లేచి బిల్లు చెల్లించి, వీథిలోకి నడిచాడు. ఇద్దరూ వొక చిన్న డాబాలోకి చేరుకున్నారు. దాన్లో దొడ్డివైపుగదిలోకి వెళ్లారు. గదికి తాళం కూడా లేదు. అక్కడ ఓ క్యాంపుమంచం, చేతులులేని కుర్చీ, పీటమీద ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కలిసిన రేగడిమట్టిముద్ద పెట్టివుంది. అతనితాలూకు పెట్టె, గోడకున్న మేకుని ఓ తువ్వాలు, మంచంమీద కంబళీ, దానిమీద "అజంతాకళ ఔన్నత్యం" అన్న ఇంగ్లీషు పుస్తకం—ఆ గదిలో యింకేమీ లేవు. దాసు మంచంమీద కూలబడి పుస్తకం తీసుకుని పుటలు తిరగెయ్యడం మొదలెట్టాడు. మధు డబ్బులేక అవస్థపడుతున్నాడని తెలుసుకున్నాడు. తీసుకొచ్చిందంతా "ఆ మనిషికి" పెట్టేశాడు కాబోలు. ఏదీ కనపడదే? బజా రెళ్ళిందా?

"ఇదా నీ గది? ఆమనిషెక్కడ?"

"అదే" అని ఆ పీటమీద వున్న మట్టి ముద్దకేసి చూపించాడు.

"వేళాకోళానికేం—చెపుదూ."

బిగ్గరగా నవ్వుతాడు మధు.

"ఛ, ఛ! నవ్వుతుంటే నాకు వొళ్ళు మండుతోంది. నీకు మేనర్స్ లేదు. ఏదో పెద్దమనిషివనుకుని, నీ భార్య పంపితే వొచ్చా."

"అది పంపింది కాబట్టే వొచ్చావ్, లేకపోతే నేనేమైతే నీ కెందుకు?"

"పండంటి పెళ్ళాన్ని వొదిలిపెట్టిన నువ్వేమైతే ఎవడి క్కావాలి?"

"నా కిద్దరు పెళ్ళాలు" బిగ్గరగా పిడుగు మారు మ్రోతలా నవ్వుతాడు మధు.

"అదే నా రెండో పెళ్ళాం" అని మళ్ళా పీటమీది మట్టి ముద్దకేసి చూపించాడు.

"నువ్వింత ఫూల్ అనుకోలేదు" అన్నాడు దాసు.

"ఫూల్స్‌కి మంచివాళ్ళు ఫూల్స్‌గానే కనిపిస్తారు."

"నీ వుపన్యాసం కోసం రాలేదు. నీ భార్య మాటేం చెపుతావు?"

"ఏమీ చెప్పను."

"వాళ్ళ భుక్తి?"

"ఇంతవరకూ వాళ్ళ కోసం, నాకా పని ఇష్టంలేకపోయినా, శ్రమ పడ్డాను. ఇంక వాళ్ళదోవ వాళ్ళు చూసుకోవాల్సిందే."

"నిన్ను నమ్మి ప్రేమించిందానికి యిదా నీ కృతజ్ఞత?"

"దానికోసం పదేళ్ళు నాలో కళని త్యాగం చేశాను. అదే నాకు కృతజ్ఞత చూపి, నన్ను వొంటిగా వొదిలేసి త్యాగం చెయ్యాలి. దానికేం? సంస్కర్తలు, దయామయులు, బంధువులు, మీరంతా వున్నారుగా పోషించేందుకు! వాళ్ళున్నయ్యా, లేకపోతే నువ్వో...."

"అధోగతిపాలు చేస్తావా...."

"జ్ఞానభక్తి ఎలా బతుకుతుందో, సుశీకూడా అల్లాగే."

"నిన్ను కోర్టుకెక్కిస్తే ?"

నవ్వుతాడు.

"పోషణార్థం ఆ మట్టిముద్ద యిస్తా కోర్టువారికి"

"నాకేం బోధపడడంలేదు."

"నువ్వు ఫూల్‌వి దాసూ! నీకేమీ అనుభవం లేదు. మొగాడు పెళ్ళాన్ని వొదిలి లేచి వెళ్ళాడంటే ఎవరో స్త్రీ వుండి తీరుతుందని మీగుడ్డి నమ్మకం. నా వ్యవహారంలో స్త్రీ లేదు. నేను ఏకాంతంగా వుండి గొప్ప శిల్పి నౌదామని సంకల్పించా."

దాసుకు నవ్వొచ్చింది.

"దగ్గర దగ్గర నలభై ఏళ్ళ వయసుంది—ఇప్పుడు శిల్పివి అవడం

ఏమిటి? నువ్వు గొప్ప శిల్పివి కాగలవని నీకెట్లా తెలుసు?"

"కాగలను. చిన్నప్పటినుంచీ ఆ చిహ్నాలు నాలో వున్నాయి. మానవుడి శరీరం నాకు గొప్ప యథార్థం. వాడి హృదయాలు, ఆత్మలు, నీతులు నా కక్కర్లేదు. శరీరంలో వొంపులు, ఎత్తులు, పల్లాలు శిల్పంలో ప్రతిఫలింపచేస్తే అతని సౌందర్యం, మంచితనం శాశ్వతంగా వుండిపోతాయి. శిల్పంలో స్థిరత్వం వుంది."

"నువ్వు నేర్చుకున్నావా?"

"లేదు. కాని బొగ్గుల మీద చాకుతో అనేక ప్రతిమలు తయారు చేశాను. ఇప్పటికేనా మించిపోయిందిలేదు. వొచ్చే ఏడాది అఖిలభారతచిత్ర ప్రదర్శనశాలకి నా ప్రతిమ పంపి మొదటి బహుమానం నెగ్గి తీరతా."

ప్రదర్శనశాలని గురించి పత్రికలో ప్రకటించడమే ఇతనిలో ఆకస్మికమైన ఈ మార్పుకి కారణం. చిన్నప్పటినుంచీ లోపల దాచబడిన సృష్టిశక్తులు చెలరేగి చిందులు తొక్కాయి.

"దీనికి ఇంట్లోంచి పారిపోవడం ఎందుకు? సుశీల ఎంత ఏడుస్తోందో తెలుసా? నిన్నెంతగా ప్రేమిస్తోందో...."

"దానిలో నాకు అక్కర్లేని తెలివి, సంగీతం, నీతి, గౌరవం, ప్రేమ మంచి అన్నీ వున్నాయి కాని నాకు కావల్సింది మాత్రం లేదు."

"ఏమి టది?"

"నన్ను ఏకాంతంగా వుండనివ్వడం. ఆ ఉద్యోగం, వాతావరణం, సంసారం నాకు సరిపడదు."

"ఎన్నిచెప్పు. నువ్వు గొప్ప ఆర్టిస్టువి కాలేవని తోస్తోంది."

"స్త్రీలు నన్ను ఒంటిగా ఉండనిస్తే నేను ఏదనుకుంతే అదవగలను. దేన్ని కావాలంటే దాన్ని సృష్టించగలను."

"అదే కాబోలు, సెక్సుకి సబ్లిమేట్ చెయ్యడమంటే"అనుకున్నాడు దాసు. అనుకొని "సరేలే వెడతాను. సుశీలకి ఏం చెప్పను?" అని అడిగాడు.

"దాని విషయం ఏమైందీ నాకు అక్కర్లేదన్నానని చెప్పు."

లోపల "స్కౌండ్రల్" అనుకున్నాడు దాసు.

"మరి నీకు డబ్బు?"

"ఏమో?"

"గుడ్‌బై. కావలిస్తే రాయి — సర్దుబాటైతే డబ్బు పంపుతా" అన్నాడు దాసు గుమ్మం దాటి.

"అక్కరలేదు యిప్పట్లో. ఇది తీసికెళ్ళి చదువుకో" అని 'అజంతా కళ"ని గూర్చిన పుస్తకం దాసు చేతులో పెట్టాడు.

"అజంతా శిల్పులు ఆంధ్రు అని మరిచిపోకు" అదే మధుసూదనం చెప్పిన ఆఖరి సందేశం.

## 4

దాసు అజంతా, ఎల్లోరాల శిల్పాన్ని చూసి ఏమీ అర్థంచేసుకోలేదు. అసలు శిల్పకళంటేనే అతనికి బోధపడలేదు. స్థిరత్వం అంటే ఏమిటి? యౌవనంలో వున్న విహారికోసం వేటాడుతూ దూరంగా నిలబడ్డాడు అవిటుడు ఆ ప్రతిమలలో విహారి తన యౌవనం పోగొట్టుకోదు—విటుడు ఆమెని పొందనూలేడు. ప్రేమ విజయంపొందదు కాబట్టి సౌందర్యానికి చావు లేదు. దీన్నిగురించి కీట్సు ఎప్పుడో పద్యంకూడా రాశాడు. గంగూలీ, రాయ్‌చౌదరి, బాపిరాజు, కజిన్సు, రాజర్ ఫ్రై మొదలైన వ్యక్తులు యీ శిల్పాలని చూసి మతిపోగొట్టుకున్నారుట! ఎందుకో దాసుకి అర్థంకాలేదు. ఓ భూకంపానికి యివన్నీ నాశనం కావు?

తన రాయబారం విజయంపొందనందుకు చిన్నపుచ్చుకుని, సుశీలతో జరిగిందంతా చెప్పడానికి కష్టంగాతోచి,దాసుపట్నం వెళ్ళిపోయి, అక్కడినుంచి అంతా లేఖాపూర్వకంగా తెలియజేశాడు. అతనికి మధు అంటే ఏవగింపుపుట్టినా లోపల జాలి కలిగింది. ఏదో అతనిలో వింత విషయం లేకపోతే సుశీల అతన్నంత బలంగా ప్రేమించివుండదు, అంత వయస్సులో, మహావృక్షాన్ని అల్లుకున్న లతలా వుంది సుశీలజీవనం. ఆవృక్షం కొమ్మలని ప్రసరింపజేసి అరణ్యం అంతా ఆక్రమించుకుంటోంది.

కాని వేళ్ళు భూమిలోనే. స్త్రీలు భూమి. భూమిని వొదిలితే ఆకాశానికి ప్రాకులాడతా నంటుంది ఆవృక్షం!

నెలగడిచింది. దాసు వ్రాసిన ఉత్తరం సుశీల చదవడం అదప్పుడే పదోసారి. అందులో కొన్ని వాక్యాలు వింతభావాలని స్ఫురింపజేశాయి! "అతను సంసార జీవనంతో అసంతృప్తి చెందినట్లు తోస్తుంది. మన గొడవే లేదు. తనని వొంటిగా వుండనియ్యమని ప్రతిమిలాడాడు. ప్రేమ అక్కర్లేదుట. ప్రేమ అనేది స్త్రీలకో జబ్బుట. అబలలు కాబట్టి పురుషుల మీద అధికారం చెలాయించి లోబరుచుకుంటారుట. స్త్రీకి జీవిత మంతా ప్రేమేనని నమ్మించేటట్లు చేస్తారుట. నాకేమీ తెలీడంలేదు. పరిచయం వున్న అందంతో విసుగు చెందాడని అనడానికీ వీల్లేదు. ఆమాటకొస్తే మీ అక్కయ్య అచ్చంగా అజంతా విగ్రహంలా వుంటుంది."

చివరిసంగతి నిజమని తెలుసుకుని సుశీల పెదవి కొరుక్కుంది. తనకంటె తనఅక్క ఎన్నోరెట్లు చక్కంది: ఒక పర్సనాలిటీ వున్నది. శిల్పిని ఆకర్షించే శరీరం ఆమెది. సుశీల చిన్నపుచ్చుగుని బాధపడింది. భర్త తనని లెక్కచెయ్యలేదంటే, సంఘంలో తన ప్రాధాన్యత పోగొట్టు కుంటుంది. తన పెళ్ళిని అందరూ వెక్కిరిస్తారు; చదువుని హేళనచేస్తారు; ప్రేమని గురించి ఏకాంకనాటకాలు వ్రాస్తారు. ఎవరిలోవారు, ఓడిపోయినా, సమాధానపడి, కొత్త ఆధ్యాత్మిక ప్రశాంతాన్ని అలవరుచుకుంటారు. కాని యితరుల సృష్టిలో, స్వార్థాన్ని పోగొట్టుకోవడం ఎంతనీచం, ఎంత కష్టం! భర్తను పొందేటందుకు దేన్ని త్యాగంచేసినా పాపంలేదు. పెద్దలు సమ్మతిస్తారు, పురాణాలు సమ్మతిస్తాయి. జ్ఞానభక్తిని బలివ్వాలి. బలిచ్చి తన ఆత్మని రక్షించుకోవొచ్చు. ఎందుకంటే, విధవకాబట్టి అక్కకి ఆత్మతో అంత అవసరంలేదు. సంసారంలేనివాళ్ళకి ఆత్మలూ, రక్షణా ఎందుకు? పదిమందీ అనదలుచుకున్నది అనడం ఎల్లానూ మానరు.

"అక్కా! నువ్వే వెళ్ళాలి - నాకిం కెవ్వరూ లేరు."

"నేను కాదు—నువ్వే వెడితే మంచిది. మనం అక్కర్లేదంటుంటే వెళ్ళడం ఎందుకు?"

"ఏదో అల్లా అన్నారు కాని, మన్ని—క్షమించు, నన్ను నిజంగా వొదిలేస్తారంటావా? శిల్పికావడమేమిటి? ఆ చెక్కడం ఏమిటో యిక్కడే చెక్కరాదూ?"

కొంచెంసేపు నిశ్శబ్దం.

"నే వెడితే బాగుండదు. అందరూ ఏమనుకుంటారు? పైగా అత నంటే అరికాలుమంట నాకు." అంది జ్ఞానభక్తి.

"నాకోసం వెళ్ళరాదూ?" నేత్రాలు తడిసినై. అక్కకేసి చూడలేక పోతోంది. "నువ్వువెడితే ఆయన తప్పకుండా వొస్తారు." చేతుల్తో మొహం కప్పుకుంది.

"నీ కెట్లా తెలుసు? అతనంటే నాకు గిట్టదని నీకూ తెలీదూ? అత నికి మాత్రం తెలీదా?"

"కాదు. నాతో వెనక అనేవారు, ఎప్పుడో అర్ధరాత్రి.... నీలో శిల్పం వుందని...."

"అంటే?"

"నాకు తెలీదు. కాని, నీకు తెలుసు, నీకు తెలుసు...." మాటల వల్ల మనసు తిప్పలేనని తెలుసుకుని, సుశీల ఏడవడం మొదలుబెట్టింది. కన్నీరు, స్త్రీలయెదుట కూడా, భాషకంటె బలమైన ఆయుధం!

"నువ్వు చెప్పేది నాకు అర్థం కావడంలేదు." అంది జ్ఞానభక్తి. జాలితో ఆమె అధరాలు వొణికాయి. చేతులని గట్టిగా బిగించుకుంది చెప్ప రాని భ్రమతో.

"నాకు చెప్పడం చేతకాదు. నీకు తెలుసు. ఆయన్ని నువ్వు— నువ్వు జయించగలవు. నా కోసం త్యాగం.... నువ్వు చెయ్యగలిగింది.... నన్ను చెప్పమనకు" అంటూ రెండుచేతులనూ ఆమె మెడచుట్టూ చేసి కౌం గులో మొహాన్ని దాచుకుంది కణతలకి అక్కకంఠంలో నరాలు వొణక డం తగిలింది.

జ్ఞానభక్తి చదువుకున్నది కాదు. నాగరికతలోని మెరుగులు ఆమె పఠించలేదు.

తన కెందుకో మధు అంటే చెప్పరాని అసూయ. భయం, బాధ కూడా. కళకోసం పెళ్ళాన్ని వొదిలి, తనకోసం కళని వొదిలితే తన కెంత విజయం!

"నేను వెళ్ళను. వెడితే,— నాకు తెలుసు." చాలాసేపు ఏడుపు సాగించింది.

## 5

జ్ఞానభక్తి అజంతా వెళ్ళి అప్పుడే నెలరోజులు కావొస్తోంది. ఇంకా రాకపోవడం సుశీలకి ఆశ్చర్యం, భయం కలగజేసింది. నాలుగుత్తరాలు వ్రాసింది—నొకదానికీ జవాబులేదు. టెలిగ్రామిచ్చింది— జవాబులేదు. తన కూతుర్ని అన్నతో పంపినందుకు విచారించింది. కూతుర్ని అక్కతో తండ్రిదగ్గరికి పంపితే ఎంతబాగుండును? కూతుర్ని చూసేనా వొచ్చును. కాని జ్ఞానభక్తి అక్కడ ఏంచేస్తోంది? ఏకాంతంగా వారిద్దర్నీ వూహించుకుని బాధపడింది. రాత్రి కలలో వారు శిలలుగా మారినట్టు కనిపించారు! సుశీల కృశించిపోతోంది. చదువు, నాగరికత, తెలివి, మంచితనం—అన్నీ తొలిగిపోయి, యధార్ధం నశించి, కరిగి కన్నీటి బిందువుగా కారింది. దాసుకి రాసింది అర్ధంలేని పిచ్చివుత్తరం, అన్నయ్యకి రాసింది. ఎవ్వరూ జవాబు వ్రాయరు. అందరికీ వేళాకోళంగా వుంది తన బ్రతుకు. తనే వెళ్ళడానికి నిశ్చయించుకుంది. వెడితే, వారిద్దర్నీ చూసి— అదృశ్యం తను భరించగలదా? ఎంత తలవొంపు! జ్ఞానభక్తిని బ్రతిమాలి పంపినందుకు విచారించింది. జ్ఞానభక్తి తన భర్తమీద చూపే ద్వేషం అంతానటనేనని భావించుకుంది. దాని శరీరంలో శిల్పం వుందిట; సుత్తితో ఆశరీరాన్ని ముక్కలు ముక్కలుగా కొట్టాలని వుంది తనకి. చాలామంది వ్యక్తులు కష్టాలవల్ల మంచివారౌతారనీ, ఆధ్యాత్మికంగా మారతారనీ అంటారు. కాని అది పూర్తి సత్యంకాదు. కష్టాలు మనకి నీచత్వం, కుట్ర, పట్టుదల, ద్వేషం నేర్పుతాయి కాని మంచితనాన్నీ, విశాలహృదయాన్నీ కాదు. సంతోషం,

సౌఖ్యం, తృప్తి మనని మంచివారినిగా చెయ్యొచ్చు అప్పుడప్పుడు, అనుభవం అంటే కష్టాలూ, కన్నీరూ అవక్కర్లేదు. నిజమైన భౌతిక సౌఖ్యం కూడా గొప్ప అనుభవం కావొచ్చు.

ధ్వంసం చేసే శక్తులు సుశీలలో చెలరేగాయి.

నిశ్చయించుకుంది, అజంతాకి ప్రయాణం కట్టింది. స్టేషన్‌కి బండి కోసం రంగడిని పంపింది. వంటింటి తలుపు గొళ్ళెం పెట్టేటప్పుడు మూల నున్న సుత్తిని చూసింది. "దాని శరీరంలో శిల్పం వుందిట! అనుకుంది.

వీథితలుపు చప్పుడు! జ్ఞానభక్తి, మధూ వొచ్చారు. సామాను హాల్లో పెట్టాడు బండివాడు. మరో పెద్ద "రోజ్‌వుడ్" పెట్టెని మధూ, బండి వాడూ భద్రంగా దింపి లోపలికి తెచ్చారు, జ్ఞానభక్తి తిన్నగా గదిలోకి వెళ్ళింది. తలగడాలో మొహాన్ని దాచుకుంది. సుశీ ఏమీ మాట్లాడలేదు. భయంకరమైన నిశ్శబ్దంతో వాతావరణం బరువెక్కింది.

"స్నానానికి నీళ్ళు కాగేలోగా కాఫీ తెప్పిస్తా" అంది సుశీ.

"ఇంట్లో కాయరాదూ?"

"ఇల్లంతా సర్ది, నేనుకూడా వొద్దామని బయలుదేరా యిప్పుడే." అంది.

ఎవ్వరూ మాట్లాడలేదు, సుశీకి ఎలా మాట్లాడాలో తెలీలేదు. అప్పట్లో భర్త తిరిగి యింటికొచ్చినందుకు ప్రధానమైన వుద్రేకం, తృప్తితో కూడుకొన్న సంతోషం! ముళ్ళతో, ఎముకలతో కప్పబడివున్నా రాజబాట రాజబాటే.

"స్టౌ" ముట్టించి, చీర మార్చి, అక్కడగ్గర కెళ్ళింది. "కాఫీ కాస్తున్నా ఈలోగా నిద్రపోతావా?"

జ్ఞానభక్తి ఆమెకేసి చూడలేదు. కళ్ళు ఎర్రగా వున్నాయి. నిద్ర లేకపోవడంవల్లో, ఏడుపువల్లో సుశీలకు తెలీలేదు.

"ప్రయాణంబడలిక, కాసేపు పడుకో" అని అక్కభుజంపైకి చెయి వేసి, ఓదార్చినట్టుగా తట్టింది. ఆల్లా ఎందుకుందో తన కర్థంకాలేదు. ఆమె శరీరాన్ని తడిమిచూసింది కొంచెం చిక్కినట్లుగా వుంది.

"ఇన్ని రోజులున్నావేం? పోనీ, వొక్క వుత్తరానికేనా జవాబు వ్రాయకూడదూ?"

"ఒక్క ఉత్తరం నాకు చూపించలేదతను"

"పోనీలే....ఏదో జరిగిపోయిందిగా.... సుఖంగా ఇంటికి చేరుకున్నారు. అదే పదివేలు."

మళ్ళా తలగడాలో మొహం దాచుకుని ఏడుస్తుంది. కష్టసుఖాల నుంచి కాపాడేది కన్నీరుతప్ప మరి మార్గం లేదు. ఆరాత్రే జ్ఞానభక్తి అన్నదగ్గరకి కలకత్తా వెళ్ళింది.

## 6

ఆరుమాసాలు గడిచాయి. సుశీల తన సంసారాన్ని నాటకంలో దృశ్యంగా మారిస్తే భరించలేదు. భర్తను అజంతా విషయాలేమీ అడగ లేదు. అతనూ ఏమీ చెప్పలేదు. సుశీల తనలో బాధను దిగమిగింది—సంశయాలతో కణతలు పగిలిపోతున్నా, భర్తకి తెలీకుండా సమత్వం, పూర్వ ప్రేమ చూపిస్తూనే వుంది. భోజనం, నిద్ర, కాఫీ, షికార్లు, కబుర్లు అన్నీ యధావిధిగా సాగిపోతున్నాయి. వ్యక్తుల బుర్రలు గొప్పభావాలచేతా, హృదయాలు నూత్నవికాసంచేతా వెలిగి చిందులు తొక్కుతుంటే; "గొడుగుమరిచి పొయ్యారు." "చాకలాడు చొక్కాతేలేదు," "కామమ్మకి మూడో మాసంట" లాంటి స్వల్ప విషయాలతో గానాన్ని చంపుకుంటారు అదేం కర్మమో!

భర్త అజంతానుంచి తీసుకొచ్చిన పెట్టెను గురించి తెగించి అడిగింది. అతను చలించకుండా పెట్టెను చూపించాడు. ఆమె అందులోని బొమ్మని చూసింది. ఏమీ ప్రశ్నించలేదు. అతనే అన్నాడు: "ఈ ప్రతిమను అఖిల భారత చిత్రప్రదర్శనశాలకు పంపుతా. రేపు సోమవారం—క్యాంపు వెళ్ళి రాగానే."

"ఏవూ రెడతారు?"

"కలకత్తా వెళ్ళాలి- బొగ్గుధర కనుక్కోవడం కోసం."

బుధవారం మధు కలకత్తా వెళ్ళాడు. అది వేసంగి. శనివారం. సుశీల పెట్టెతీసి ప్రతిమను నిలబెట్టి చూసింది. కింద అట్టమీద "ఆధునిక బానిస— శిల్పి: మధు" అని వ్రాసి వుంది. ఒకే బేస్‌మీద రెండు విగ్రహాలు కలిసివున్నాయి. ఒక పురుషుడు మోకాళ్ళని క్రింద ఆనించి, రెండు చేతులూ నడుం వెనకభాగాన్ని కట్టుకుని తల కిందికి వొంచి రెప్పలు వాల్చి వున్నాడు; అతను మెడమీద వొక చెయ్యి నొక్కిపెట్టి, రెండోచేతులో వంటగరిట పట్టుకుని నిటార్గా నిలబడివుంది వొక స్త్రీ, అదీ ఆ విగ్రహం. సుమారు నాలుగడుగుల ఎత్తు.

సుశీలకి పూర్తిగా అర్థంకాలేదు. పురుషుడు నాగరికప్రపంచంలో స్త్రీకి బానిసత్వం చేస్తున్నాడనా, లేక యిద్దరూ కలిసి తిండికీ, వంటింటికీ బానిసలుగా వున్నారనా దాని భావం? కాని వొకటి తెలుసుకుంది. ఆస్త్రీ బొమ్మ జ్ఞానభక్తిని జ్ఞప్తికి తెచ్చింది. అక్క పొందిన అఖండవిజయాన్ని ప్రకటించే చిహ్నం ఆబొమ్మ. దాని సౌందర్యాన్ని వర్ణించడం ఎట్లా? చీరకీ, చొక్కాకీ, మోటారుకీ, కలానికీ "అందం" అనేమాట వుపయోగించడం అలవాటైతే, నిజమైన అందాన్ని ఎదుర్కొన్నప్పుడు మాటలు దొరకవు వర్ణించేందుకు. వాడుకవల్ల "అందం" అనే పదానికి విలువ నశించింది.

సాయంత్రం కలకత్తానుంచి జ్ఞానభక్తి వొచ్చింది. ఇద్దరూ చాలా సేపు మాట్లాడుకున్న తర్వాత సుశీల అంది: "బావ కలకత్తా వొచ్చేరే? నీకు తెలీదూ?— ఉత్తరం వ్రాశా నన్నారు!"

"తెలుసు...."

బావవిషయం యెత్తితే అక్క యెల్లా మారుతుందో చూడాలని సుశీల అర్థంలేని ప్రశ్నలు వేసినా, జ్ఞానభక్తి దొరకలేదు. ఉద్రేకం అణిచి పెట్టుకోడంలో స్త్రీలు నిజంగా శిలావిగ్రహాలే.

సుశీలకు కొత్తభావం స్ఫురించింది. పూర్వం అక్క తన భర్తంటే ఎంతో ద్వేషం, అయిష్టత ప్రకటించేది. ఎందుకు? అతను తను కోరింది యివ్వగలడు కదా అనుకుని తన వాంఛనీ, అనురాగాన్నీ ద్వేషంగా మార్చిందన్నమాట. పొందలేని వొస్తువుని ద్వేషించటం ఎంత సహజం!

ఆస్త్రీబొమ్మ నిజంగా అక్కను చూసి చెక్కిందే. దానిభావం, తనకి కాక అక్కకి బానిసగా మారాడనా?

సుశీల సుత్తిని తీసుకుంది. తరవాత ఏదో సమాధానం చెప్పొచ్చు. మించిపోయింది లేదు. భర్త మరో విగ్రహం- తనలాంటిదాన్ని తయారు చెయ్యగలడు. తనకే బానిసగా మారాడంటే ఎంత బాగుంటుంది! శీలం వున్న సుశీల అప్రతిమని నిర్మూలనం చెయ్యడానికి సుత్తి పైకెత్తింది. జ్ఞానభక్తి వారించింది; బ్రతిమిలాడింది: చెయ్యి పట్టుకుంది; గడ్డం పట్టుకుంది.

"అతను లేనప్పుడు నువ్వు యిల్లా చేస్తావని భయపడే వొచ్చాను నేను. అతను యీ విగ్రహాన్ని సృష్టించడంకోసమే పుట్టానని చెప్పాడు. అందుకనే అతను జీవించాడుట. వొద్దు—"

అక్క తనని యింత వారించి బ్రతిమిలాడకపోతే సుశీల ఆ బొమ్మని క్షమించివుండును. అక్క తన శరీరాన్నీ, "ప్రతి"నీ రక్షించుకోడానికి ఎంతో తంటాలుపడుతోంది. తన స్వార్థాన్ని, నీతిని ప్రకటించాలంటే దాన్ని నిర్మూలం చెయ్యాలి. సుత్తితో స్త్రీబొమ్మని కొట్టింది. మళ్ళా, మళ్ళా, బొమ్మంతా ముక్కలైంది.

జ్ఞానభక్తి ఆపుకోలేక బిగ్గరగా ఏడ్చింది. "సుశీ, నువ్వు నన్ను పూర్తిగా ఏమీ చెప్పనివ్వలేదు. నాకు చెప్పడానికి ధైర్యం రాలేదు. నేను చెప్పేది నిజమని నమ్మవనుకుని చెప్పలేకపోయ్యాను. కాని నిజం, నిజం...."

మళ్ళా ఏడుస్తుంది. జుట్టు ముడి వూడి, చెక్కిళ్ళ మీదికి జారింది.

"నేను తొందరపడ్డాను. కాని, అక్కా, ఆ బొమ్మ యిక్కడ వున్నన్నిరోజులూ నాకు శాంతి లేదు—ఎంత బాధపడ్డానో దైవానికి తెలియాలి. అసలు, అదెక్కడున్నా నాకు శాంతి వుండదు. ఇప్పుడు నాకు విశ్రాంతిగా వుంది, ఇంక చెప్పు. నమ్ముతాను."

"నమ్మాలి—ఒట్టుపెట్టు."

సుశీల అక్కచేతులో చెయ్యి పెట్టింది.

"నేను చెప్పడం నాకే కష్టంగా వుంది. ఆ సత్యం నాకే అసంభవంగా, రుచించకుండా వుంది."

"అబ్బ! దబ్బుని చెప్పు...."

చెప్పింది జ్ఞానశక్తి— పగిలిన ముక్కలని హస్తంలో తీసుకుని వాటికేసి చూస్తూ

"నన్ను అతను ఎప్పుడూ తాకలేదు— ముట్టలేదు— కోరలేదు."

"నిజంగా?"

"మనం పిచ్చివాళ్ళం. పురుషులకి యెప్పుడూ మన గొడవే అనుకుంటాం. బావ చాలా చిత్రమైన మనిషి."

పసిపాపని చేతులారా చంపుకున్న తల్లిలా సుశీల బాధపడింది. గొప్ప సత్యాన్ని సంఘం నమ్మదు. అందుకనే సంఘం అసత్యాలమీద ఆధారపడివుంది. అందుకనే యీ నాగరికసంఘాలలో అజంతా శిల్పాల్లాంటి వ్యక్తులు జన్మించరు. సత్యాలలో గొప్పసత్యం, సత్యాలు సంభవించడమే)

ప్రచురణ : భారతి 1942 ఫిబ్రవరి